క్లుప్తంగా

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత



పాఠశాలలో మధ్యాహ్న భోజన గదిని ప్రారంభిస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని ఊటుకూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు చేయూతనిచ్చారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించారు. పూర్వ విద్యార్థి శ్రీహరినందన్‌కు తోడుగా మరికొందరు తమవంతుగా సాయంగా మధ్యాహ్న భోజనం చేసేందుకు అవసరమైన వసతి గదిని నిర్మించారు. ఆదివారం పాఠశాల హెచ్‌ఎం మనోజ్ ఆధ్వర్యంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఫణికుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బాలకృష్ణ, కుళ్లారెడ్డి, ఉపాధ్యాయులు హనుమంతరాయుడు, నాగచంద్రశేఖర్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేయండి



మంత్రి సవితను ఆహ్వానిస్తున్న బాబయ్య దర్గా పీఠాధిపతి

పెనుకొండ: పట్టణంలోని పవిత్ర బాబయ్య స్వామి దర్గాలో ఈనెల 13న నిర్వహించనున్న గంధం, ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేయాలని బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా మంత్రి సవితను కోరారు. ఈ మేరకు పట్టణంలోని మంత్రి స్వగృహంలో ఆమెను కలసిన ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేశారు. గంధం వేడుకతో పాటు ఉరుసు మహోత్సవానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. బాబయ్యస్వామి దర్గా విశిష్టతను మంత్రికి వివరించారు.

తిరుమలకు భక్తుల పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

రొద్దం: మండల పరిధిలోని ఎల్‌జీబీ నగర్ నుంచి తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధికి ఆదివారం వి.వెంకటేసులు ఆధ్వర్యంలో పలురువు భక్తులు పాదయాత్రగా వెళ్లారు. మండలంలోని తుకకలాపట్నం, పార్లపల్లి, పెద్దిపల్లి, ఎల్‌జీబీనగర్, కంబాలపల్లి, బీదానిపల్లి, బొక్సంపల్లి, కర్ణాటక అచ్చంపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. కాలినడక వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందన్న నమ్మకంతో వెళుతున్నట్లు భక్తులు తెలిపారు.

తప్పిన ప్రమాదం



బోల్తా పడిన ట్రాక్టర్

సోమందేపల్లి: మండలంలోని మేకలపలి గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతు ముత్యాలప్పకు పెను ప్రమాదం తప్పింది. ఆదివారం తన పొలంలో వరి పంటకు నాట్లు వేయడం కోసం రొటో వేటర్ ద్వారా పనులు చేస్తుండగా ట్రాక్టర్ తిరగబడింది. త్రుటిలో ఆయన ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. ట్రాక్టర్ కింద పడిపోగా పక్క పొలాల్లో ఉన్న రైతులు గమనించి అతన్ని కాపాడారు.

కుష్టు నివారణకు కృషి

పావగడ: కుష్టు వ్యాధి నివారణకు కృషి చేస్తున్నట్లు స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రం అధ్యక్షుడు జపానంద స్వామిజీ తెలిపారు. నియోజకవర్గంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ఉచితంగానే చికిత్సతో పాటు మందులు అందించే కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. ఆదివారం పావగడలో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా తాలూకాలోనే కాకుండా ఆంధ్ర ప్రాంతంలో కూడా సుమారు 15 వేల మంది కుష్టు రోగులకు చికిత్స, మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆరోగ్యాధికారి డా కిరణ్, డా జీఆర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి మలుపు

హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లోని రోడ్లపై ఉన్న మలుపులు ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి. తరచూ ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాల్లో ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కనీసం మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, ముళ్ల కంపలను కూడా తొలగించకపోవడంతో ఎప్పుడు ఏ వార్త వినాల్సి వస్తుందో తెలీడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

–రొద్దం/పెనుకొండ రూరల్/పరిగి/చిలమత్తూరు:



పెనుకొండ మండలం గోనిపేట రహదారిలో మలుపు



పెనుకొండ మండలం శెట్టిపల్లి రహదారిలోని ప్రమాదకరమైన మలుపు



పరిగి మండలంలోని కొడిగెనహళ్లి వద్ద ప్రమాదకరమైన మలుపు



పరిగి మండలం కాలువపల్లి క్రాస్ మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రవితేజ (ఫైల్)



మలుపుతో పాటు ముళ్ల పొదలతో ఉన్న చిలమత్తూరు మండలం లాలేపల్లి ప్రధాన రహదారి



రొద్దం మండలం ఆర్ కొట్టాల వద్ద పావగడ-పెనుకొండ ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



రొద్దం మండలం చెరుకూరు వద్ద పెనుకొండ-మడకశిర రోడ్డులో ఇలా..

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



రొద్దం మండలంలో ప్రధాన రహదారుల్లోనే మలుపులు ఉన్నాయి. దీంతో నిత్యం ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు అయినా ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు తీసుకొని ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలి.

– ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, రొద్దం

దారి పొడవునా మలుపులే..



గోనిపేట నుంచి పెనుకొండ వరకు రహదారి మొత్తం అటవీ ప్రాంతంలో ఉంది. రహదారి మలుపుగా దాదాపుగా 8 కిలో మీటర్లు ఉంది. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే అవకాశం లేకుండా పోయింది. వాహనాలకు హారన్ లేకపోతే ప్రయాణించడం అసాధ్యం. ఈ దారిపై ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సోమశేఖర్‌రెడ్డి, గోనిపేట, పెనుకొండ మండలం

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?



పరిగి మండలంలో ప్రమాదకర మలుపులు చాలా ఉన్నాయి. ప్రధానంగా పరిగి చెరువు కట్ట కింద ఉన్న హిందూపురం – మడకశిర ప్రధాన రహదారిలోనే 10 పైగానే మలుపులు ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాన్ని సైతం గుర్తించలేని మలుపులతో ప్రయాణాలు సాగించలేకపోతున్నాం. హిందూపురం నుంచి మడకశిర వైపు వెళ్లే ప్రధాన రహదారిలో కొడిగెనహళ్లి, కాలువపల్లి క్రాస్, పరిగి, ధనాపురం, హొన్నంపల్లి తదితర ప్రాంతాలలో జరిగిన ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలను కోల్పోయారు. అయినప్పటికీ ప్రభుత్వంతో పాటు అధికారులెవరూ స్పందించలేదు.

– తిమ్మారెడ్డి, ధనాపురం, పరిగి మండలం

రోడ్డుపై వెళ్లాలంటేనే భయం



చిలమత్తూరు నుంచి లాలేపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో మరవకొత్తపల్లి దాటగానే రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు ఉండటంతో వాహనాల్లో వెళ్లాలంటే భయమేస్తోంది. ముళ్లపొదలు కాస్తా రోడ్డు మీదకు వస్తున్నాయి. దీనికి తోడు మలుపులు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.

– అంజన్‌రెడ్డి, లాలేపల్లి, చిలమత్తూరు మండలం

విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించండి

- రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చిస్తున్న నాయకులు

పెనుకొండ: ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న ట్రూఆఫ్ చార్జీల భారాన్ని (అదనపు విద్యుత్ చార్జీలు) వెంటనే ఉపసంహరించుకోవాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేసారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీఎం హరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై మోపిన రూ.15,441 కోట్ల ట్రూఆఫ్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని, కనీసం పబ్లిక్ హియరింగ్ నిర్వహించకుండా ఏకపక్షంగా ట్రూఆఫ్ విధించడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు వినియోగదారుల ప్రయోజనాలు కాపాడుతామని గొప్పలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇలాంటి నిరంకుశ పోకడలకు స్వస్తి పలకాలని నాయకులు డిమాండ్ చేశారు. కలసి వచ్చే రాజకీయ పార్టీలతో, ప్రజా సంఘాలతో కలసి ప్రజలను చైతన్య పరుస్తూ పోరాటం సాగిస్తామన్నారు. ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే నిత్యావసర ధరలు నింగినంటాయని, ఎన్నికల హామీలు తుంగలో తొక్కారన్నారు. సమావేశంలో సీపీఐ శ్రీరాములు, బాబావలి, గంగాధర్, నాగరాజు, కాంగ్రెస్ నాయకులు నిషార్, తిప్పన్న, ఉత్తప్ప, అహ్మద్, ఇలియాజ్, బావమ్మ, నరసింహ, వెంకటేసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబువి అన్నీ ఉత్తుత్తి హామీలే

- ఆరునెలలు గడుస్తున్నా సంక్షేమ పథకాల అమలేదీ?
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి మాట్లాడుతున్న ఈరలక్కప్ప

అమరాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబువి అన్నీ ఉత్తుత్తి హామీలేనని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గం సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. చెప్పడం... మరచిపోవడం ఆయనకు అలవాటైనన్నారు. ఆదివారం మండలంలోని దేవగానపల్లిలో తమ్మడేపల్లి ఉప సర్పంచ్ నాగభూషణ కూమార్తె లిఖిత వివాహ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు హెచ్‌బీ.నర్సేగౌడ్‌తో కలసి ఆయన మాట్లాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా రైతులకు పెట్టుబడి సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాలను ఇంత వరకూ అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు వేస్తామని చెప్పి అసలు బడ్జెట్‌లో దాని ఊసే లేకుండా చేశారన్నారు. కూటమికి ఓటు వేసి మోసం పోయామని ప్రజలందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఏ సంక్షేమ పథకంలోనూ అవినీతికి తావు లేకుండా అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం నాగభూషణ వచ్చిన పార్టీ నాయకులకు శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష, బీసీ సంఘం కార్యదర్శి కాంతరాజు, సర్పంచ్ గిరిజమ్మ, ఎంపీటీసీ హనుమంతరాయ, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, నాయకులు ఇషాక్, శివకుమార్, మంజునాథ, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో రన్నరప్‌గా మడకశిర



రన్నరప్‌గా నిలిచిన మడకశిర జట్టు

మడకశిర: అనంతపురంలో ఆదివారం ఆర్డీటీ సహకారంతో అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. మిక్స్‌డ్ జెండర్ ఫెస్టివల్ ఫైనల్ రౌండ్స్ పోటీల్లో మడకశిర ఫుట్‌బాల్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. తొలుత ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయిలో ఆర్డీటీ మైదానంలో మండల జట్ల మధ్య లీగ్ పోటీలు జరిగాయి. ఆ పోటీల్లో మడకశిర జట్టు ఫైనల్‌కు చేరింది. ఆ తర్వాత జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హిందూపురం జట్టుతో మడకశిర జట్టు తలపడింది. ఆ మ్యాచ్‌లో మడకశిర జట్టు రన్నర్స్‌గా నిలిచింది. మడకశిర ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు నవీద్, నాగభూషణం, కోచ్‌లు బాలాజి, జగదీష్ తదితరులు జట్టును అభినందించారు.

కన్నడ భాషను పరిరక్షించాలి



విజేతలకు కన్నడ శ్రీ ప్రశస్తిని అందిస్తున్న దృశ్యం

పావగడ: ఇతర భాషల ప్రభావంతో పావగడ నియోజకవర్గంలో కనుమరుగైపోతున్న కన్నడ భాషను పరిరక్షించాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప కన్నడ పర సంఘాలకు సూచించారు. వైఎన్ హొసకోట గ్రామంలో నిర్వహించిన నమ్మ కన్నడ హబ్బ వేడుకల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత 38 సంవత్సరాలుగా గడినాడు పావగడలో కన్నడ భాష ఉనికిని కాపాడుతూ వచ్చిన స్థానిక కన్నడ కళ, సాంస్కృతిక మండలి శ్రమ అభినందనీయమన్నారు. మాజీ టీపీఎస్ అధ్యక్షుడు సొగడు వెంకటేశ్ మాట్లాడుతూ స్థానికంగా పరిశ్రమలు లేకపోవడంతో నిరుద్యోగ యువకులు వలస పోతున్నారన్నారు. ఆరోగ్యం, వసతి, విద్య రంగాలు కుంటు పడ్డాయన్నారు. కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి మాట్లాడుతూ గడినాడు ప్రాంతంలో కన్నడ భాషాభివృద్ధికి స్థానిక కన్నడ కళ, సాంస్కృతిక మండలి నిరంతర ప్రయత్నాలు సాగిస్తోందని కొనియాడారు.

నేడు పరిగిలో ఉషశ్రీచరణ్ పర్యటన

పరిగి: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పరిగి మండలంలో సోమవారం పర్యటించనున్నారని ఆపార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. ఊటుకూరులో పంచాయతీలో రైతు సమస్యలపై ఉద్యమించడానికి నాందిగా చేపడుతున్న ఈకార్యక్రమానికి ఉషశ్రీచరణ్ హాజరవుతున్నారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి మండలంలోని అన్ని పంచాయతీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు తప్పక పాల్గొనాలన్నారు.

భక్తిశ్రద్ధలతో శనేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు

రొళ్ల: మండల పరిధిలోని కొడగార్లగుట్ట గ్రామ సరిహద్దు కర్ణాటక ప్రాంతం గొల్లహళ్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం ఘనంగా శనేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

సంక్షిప్త సమాచారం

పీహెచ్‌సీకి ప్రహరీ నిర్మించండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ నిర్మించి విష పురుగుల ప్రవేశించకుండా చూడాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పీహెచ్‌పీ కొండ సమీపంలో ఉండటంతో విష పురుగుల బెడద అధికంగా ఉందని వాపోతున్నారు. ప్రహరీ నిర్మించాలని జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి వైద్య సిబ్బంది తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ప్రహరీ నిర్మించి విషపురుగుల బెడద తప్పించాలని కోరుతున్నారు.

నిబంధనలు పాటించాలి

గుడిబండ: మండల పరిధిలోని నాగేపల్లి గ్రామం వద్ద ఆదివారం ఎస్‌ఐ రాజ కుళ్లాయప్ప, సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించని వాహనాదారులకు జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. ఏఎస్‌ఐ చంద్రశేఖర్ , పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించుకోవాలని సూచించారు.

వైద్య శిబిరానికి స్పందన

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భగత్ సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తి పుండరీకాక్ష జ్ఞాపకార్థం చేపట్టిన కార్యక్రమంలో దాదాపు 200 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలను చేపట్టినట్లు సంస్థ కార్యదర్శి కార్తీక్ తెలిపారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కొలిచే భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

అమరాపురం: హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెలవు రోజు కావడంతో జిల్లాతో పాటు కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా కనకదాస జయంత్యుత్సవం



కల్లూరులో జ్యోతులు మోస్తున్న మహిళలు

లేపాక్షి : కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాస జయంతి వేడుకలను ఆదివారం మండలంలోని కల్లూరు, నాయనపల్లి గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వసుంధర, మాజీ సర్పంచ్ గంగప్పతో పాటు కురుబలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

మడకశిర: మండలంలో ఈనెల 13 నుంచి ప్రారంభమయ్యే భక్తరహళ్ళి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం 25 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మడకశిర ఆర్టీసీ డిపో డీఎం రామసుబ్బయ్య తెలిపారు. మడకశిర, హిందూపురం డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతామన్నారు. అమరాపురం, మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ నుంచి కూడా ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా బ్రహ్మరథోత్సవం, భూతప్పల ఉత్సవం రోజున బస్సులను అధిక సంఖ్యలో అందుబాటులోకి తెస్తామన్నారు.

పకడ్బందీగా బందోబస్తు

మడకశిర: భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ రామయ్య తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, భక్తులు బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరపడానికి సహకరించాలని కోరారు.